ప్రజాశక్తి

బుధవారం 7 జూన్ 2023 5

పార్వతీపురం మన్యం



స్వచ్ఛ గ్రామాలు ఆవిష్కృతం కావాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్

పరిశుభ్రమైన గ్రామాలు ఆవిష్కృతం కావాలని, అందుకు స్వచ్ఛ భారత్ ఉద్యమాన్ని ముమ్మరం చేయాలని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ తాగునీరు, పారిశుధ్య విభాగం కార్యదర్శి విన్ని మహాజన్ అన్నారు. స్వచ్ఛ భారత్ ఉద్యమం, జల జీవన్ మిషన్‌పై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్లతో మంగళవారం విజయవాడ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన లేని గ్రామాలుగా ప్రతి గ్రామాన్ని తీర్చిదిద్దాలన్నారు. సాలిడ్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ పక్కాగా అమలుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల్లో అవగాహనకు ర్యాలీలు, గ్రామసభలు నిర్వహించి ఆలోచనా విధానంలో మార్పుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జల జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు అందాలని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



సోమవారం రాత్రి సబ్‌స్టేషన్‌కు వెళ్లి అధికారులను నిలదీస్తున్న ప్రజలు

ఉక్కపోత... విద్యుత్తు కోత


వేసవి మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజలు అనధికార కరెంట్ కోతలతో ఆవేదన చెందుతున్నారు. అదీ రాత్రి పూట అనధికారికంగా గంటల తరబడి విద్యుత్తు సరఫరాను నిలిపేస్తుండడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. పగలంతా ఏదో పనులు చేసుకొని రాత్రి పూట కాస్త సేద తీరదామంటే ఇష్టారాజ్యంగా విద్యుత్తు కోతలు విధించడంతో అల్లాడిపోతున్నారు. ఉక్కపోతకు విద్యుత్తు కోతలు తోడవంతో నిద్రలేని రాత్రులు గడపాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. రాత్రిపూట ఇష్టారాజ్యంగా విద్యుత్తు సరఫరాను నిలిపేయడంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోక పోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు.

- రాత్రిపూట వేళాపాళా లేని విద్యుత్తు కోతలు
- నిద్రలేని రాత్రులు గడుపుతున్న ప్రజలు
- మూడు రోజులుగా ఇదే పరిస్థితి
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కురుపాం

రెండు రోజుల క్రితం వీచిన భారీగాలులకు కురుపాం పరిసర ప్రాంతాల్లో చెట్లు విరిగి, విద్యుత్తు వైర్లు తెగిపడ్డాయి. కురుపాంలో శివ్వలవీధి, దొనక వీధి, నెయ్యలవీధితో పాటు పలు గిరిజన గ్రామాల్లో పూర్తిగా రెండు రోజులు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఆ ప్రాంతాల్లో తాగునీటికి, ఇంటి అవసరాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ విద్యుత్ శాఖ సిబ్బంది లైన్లను పునరుద్ధరించి పూర్తిస్థాయిలో సరఫరా అందించలేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా రాత్రి, పగలు తేడాలేకుండా విద్యుత్తు లేకపోవడంతో చంటి పిల్లలు, వృద్ధులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. రాత్రిపూట విద్యుత్తు లేకపోవడంతో ఒక వైపు దోమలు, మరోవైపు ఉక్కపోతతో స్థానికులు ఉక్కిరిబిక్కిరై రోడ్ల మీదే గడపాల్సిన పరిస్థితి వచ్చింది. ఆగ్రహించిన ప్రజలు అర్ధరాత్రి పూట సంబంధిత అధికారులకు ఫోన్లో ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. చివరికి విసుగుచెంది సోమవారం రాత్రి కురుపాం సబ్‌స్టేషన్‌కు వెళ్లి సంబంధిత అధికారులను నిలదీశారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. యథేచ్ఛగా కొనసాగుతున్న అనధికార విద్యుత్తు కోతలపై ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని, పాత ట్రాన్స్‌ఫార్మర్లు మార్పుచేయడంతోపాటు ఆయాప్రాంతాల విద్యుత్తు లోడ్ ఆధారంగా అదనపు సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

కరెంట్ కోతతో ఆర్థికంగా ఇబ్బందులు



అసలే రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితుల్లో టైలరింగ్ వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నాం. అటు వంటిది ఈ వేసవిలో వేళాపాళా లేని విద్యుత్తు కోతల వల్ల పూర్తిగా బట్టలు కుట్టలేక, వేరే కూలి పనులకు వెళ్లలేక కుటుంబాన్ని పోషించడానికి ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం.

- గొర్లి చిన్నారావు, టైలర్, కురుపాం



నిరాహార దీక్షలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ నిరాహార దీక్ష

ప్రజాశక్తి-కలెక్టరేట్

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ ఆధ్వర్యాన పార్వతీపురం ఐటిడిఎ కార్యాలయం ఎదుట మంగళవారం ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు మాట్లాడుతూ గిరిజన విద్యారంగం నిర్లక్ష్యానికి గురవుతోందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యతని అన్నారు. గతేడాది యుటిఎఫ్ ఆధ్వర్యంలో జీపుజాతా నిర్వహించి గిరిజన విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా, పట్టించుకోలేదన్నారు. స్థానిక అధికారులు కూడా ఉపాధ్యాయుల సమస్యలపై చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. అధికారులకు అనుకూలమైన అంశాలపై త్వరగా స్పందిస్తున్నారని, ఉపాధ్యాయుల సమస్యలపై మాత్రం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐటిడిఎ పరిధిలో పిజిహెచ్ఎం పోస్టులు, ఎస్ఎ కేడర్ పోస్టులను ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇతర మేనేజ్‌మెంట్స్ పండిట్స్, పిఇటి పోస్టులు అప్‌గ్రేడ్ చేశారు కానీ, ఐటిడిఎ జరగలేదని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. సవర భాషా వాలంటర్లను నియమించక పోవడం వల్ల గిరిజన విద్యార్థుల్లో డ్రాపౌట్ల సంఖ్య పెరిగిందని, వెంటనే భాషా వాలంటీర్లను నియమించాలని జిల్లా అధ్యక్షులు టి.రమేష్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కె.భాస్కర్, పి.వెంకటనాయుడు, ప్రశాంత్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై వినతి

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని మంగళవారం కలెక్టరేట్‌లో ఎఒ ఉమామహేశ్వరరావుకు ఫ్యాప్టో నాయకులు వినతి అందించారు. ఫ్యాప్టో రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో భాగంగా జూన్ 5వ తేదీ నుండి సెప్టెంబర్ ఒకటో తేదీ వరకు వివిధ దశల పోరాట కార్యక్రమాలు చేపడుతున్నారు. మొదటి దశ కార్యాచరణలో భాగంగా మంగళవారం 8 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎఒకు అందించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు బాలకృష్ణారావు, మురళీ మోహనరావు, శ్రీనివాసరావు, గోవింద నాయుడు, నర్సింగరావు, రమేష్ కూర్మినాయుడు, గణపతిరావు, పి.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీల వెబ్ ఆప్షన్ గడువు పొడిగించాలి

ఉపాధ్యాయుల బదిలీల కోసం వెబ్ ఆప్షన్ గడువును పొడిగించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంతవరకూ ఖాళీల జాబితా పెట్టలేదని, ఆప్షన్లు ఇచ్చేందుకు ఆన్‌లైన్‌లో అవకాశం ఇవ్వలేదని చెప్పారు. తప్పనిసరి బదిలీ అయ్యే ఉపాధ్యాయుడు సుమారు 1800 ప్రాంతాలను ఎంపిక చేసుకోవాలని, ఇది చాలా కష్టమని తెలిపారు. మరో రెండు రోజులు ఆప్షన్ ఇచ్చుటకు తేదీలను పొడిగించాలని కోరారు. ఖాళీలను బ్లాక్ చేయకుండా చూపిస్తామన్న మంత్రి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.



ధర్నా చేస్తున్న వ్యకాస నాయకులు, దళితులు

ఉపాధి కోసం దళితుల ధర్నా

ప్రజాశక్తి-బలిజిపేట

పెదపెంకి గ్రామ దళితులకు ఉపాధి పనులు కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బలిజిపేట ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నల్ల ఈశ్వరరావు మాట్లాడుతూ పెదపెంకి గ్రామంలో ఉపాధి పనులు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. నెల రోజుల నుండి పనులు కావాలని దళితులు అడిగినా ఇంతవరకు పనులు చూపించకపోవడం దారుణమన్నారు. పనులు అడిగితే 'మీ ఫీల్డ్ అసిస్టెంట్ లేడు. సస్పెండ్ అయ్యాడ'ంటూ సమాధానం చెబుతున్నారని, దీనివల్ల పనుల్లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధర్నా వద్దకు అధికారులు వచ్చి గురువారం నుంచి పనులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆవు సాంబమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు రాము, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-కలెక్టరేట్



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వ్యవసాయ, అనుబంధ రంగాల పురోగతిపై మండల అధికారులతో జిల్లా కలెక్టరు సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ ఖరీఫ్ పంట సీజనుకు కావలసిన ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో కొరత రాకుండా చూడాలని వ్యవసాయ అధికారులకు తెలిపారు. రైతులకు కావలసిన విత్తనాలు, ఎరువులు ఆన్‌లైన్లో రిజిస్ట్రేషను చేయించాలన్నారు. జిల్లాకు 27 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు కేటాయించగా, ఇప్పటికే 14 వేల క్వింటాళ్లను ఆర్‌బికెలకు పంపించినట్లు తెలిపారు. పచ్చి రొట్ట విత్తనాలు 18 వేల క్వింటాళ్లను ఆర్‌బికెలకు అందించగా, ఇప్పటికే 50 శాతం పంపిణీ చేశారని, మిగతా విత్తనాలు పంపిణీ పూర్తి చేయాలని తెలిపారు. యంత్ర సేవా పథకంలో డ్రోన్ పైలెట్ కోసం 45 మంది అవసరం ఉండగా 11 మందిని మాత్రమే ఎంపిక చేశారని, మిగిలిన 34 మందిని త్వరగా గుర్తించాలని సూచించారు. పిఎం కిసాన్‌కు అర్హత గల రైతులందరికీ ఇకెవైసి చేయించాలన్నారు.

జిల్లాలో ఉద్యాన పంటలు అభివృద్ధి చేయుటకు నిర్దేశించిన లక్ష్యం 5750 ఎకరాల్లో ప్లాంటేషను పూర్తిచేయాలన్నారు. జిల్లాకు మంజూరు చేసిన 68 ఫిష్ ఆంధ్రా యూనిట్ల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా ఉద్యాన అధికారి కెఎస్ఎన్ రెడ్డి, జిల్లా మత్స్య అధికారి వేమూరి తిరుపతయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమగ్రంగా నివేదికలు

ప్రజాశక్తి- సీతంపేట



మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

ఐటిడిఎ పరిధిలోని అన్ని శాఖల అధిపతులు సమగ్రంగా రిపోర్టులు తయారు చేసి అందజేయాలని పిఒ కల్పన కుమారి ఆదేశించారు. మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ హక్కు పట్టాలకు సంబంధించి ఇంకా పెండింగులో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గిరిభూమి వెబ్‌సైట్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఇ-క్రాప్ అప్లోడింగ్ పూర్తి చేయాలని సూచించారు. రైతు భరోసా పెండింగ్ పేమెంట్లను పరిష్కరించాలన్నారు. ఎల్‌టిఆర్‌కు సంబంధించిన కేసుల జాబితాను సమర్పించాలన్నారు. అన్ని విభాగాల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎపిఒ రోసిరెడ్డి, డిహెచ్ఒ సత్యనారాయణ రెడ్డి, జిసిసి డిఎం సంధ్యారాణి, ఇఇ మురళి, డిడి బి.నగేష్, తహశీల్దార్ ఎస్.నర్సింహమూర్తి, పిఎఒ హరికృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ, పశు సంవర్ధక శాఖ ఎడి శ్రీనివాసరావు, ఎటిడబ్ల్యుఒలు మంగవేణి, శ్రీనివాసరావు, గురుకులం సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.



రాజన్నదొరను పరామర్శిస్తున్న ఎంపి బెల్లాన


రాజన్నదొరకు ఎంపి పరామర్శ

ప్రజాశక్తి-సాలూరు

డిప్యూటీ సిఎం రాజన్నదొరను మంగళవారం విజయనగరం ఎంపి బెల్లాన చంద్రశేఖర్ పరామర్శించారు. రాజన్న దొర క్యాంపు కార్యాలయంలో ఎంపి కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇటీవల వైసిపి నిర్వహించిన బైక్ ర్యాలీలో రాజన్నదొర కాలికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ఆయన విశ్రాంతిలో ఉన్నారు.

డి-పట్టా భూములు గిరిజనులకు అప్పగించాలి

ప్రజాశక్తి-జియమ్మ వలస



ధర్నా చేస్తున్న గిరిజనులు, వ్యకాస నాయకులు

డి పట్టా భూములను సర్వే చేసి బొడ్డవలస గిరిజనులకు అప్పగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కొల్లి గంగునాయుడు అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జియ్యమ్మవలస పంచాయతీ పరిధిలో సర్వే నంబరు 9లో బొడ్డవలస గిరిజనులు కొసక చంద్రయ్య, కొసక తమయ్య, కొండ గొర్రె పగడాలు, నిమ్మక పెంటయ్య, కొండ గొర్రెలకు నాలుగెకరాల డి-పట్టా భూమి ఉందని, ఆ భూమిని సర్వే చేసి గిరిజనులకు అప్పజెప్పాలని డిమాండ్‌చేశారు. 40 ఏళ్లుగా గిరిజనులు ఆ భూమిని సాగు చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. ఆ భూమి తమదని కొంతమంది గిరిజనేతరులు అంటున్నారని, ఈ విషయం పోలీస్ స్టేషన్ల వరకు వెళ్లిందని చెప్పారు. రెవెన్యూ అధికారులు కలుగజేసుకొని సమగ్ర సర్వే చేసి గిరిజనులుకు భూములు అప్పజెప్పాలన్నారు. అనంతరం తహశీల్దార్ సీతారామయ్యకు వినతి సమర్పించారు.

ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి కూరంగి సీతారాం, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు మోహన్‌రావు, గిరిజనులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే కళావతి

ప్రజాశక్తి-పాలకొండ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వి.కళావతి

ఆస్పత్రిలో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ వి.కళావతి అన్నారు. మంగళవారం ఏరియా ఆస్పత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. ప్రహరీ నిర్మాణానికి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతానన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా మరిన్ని శస్త్రచికిత్సలు చేయాలన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. ఎటువంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత మంత్రి, అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానన్నారు. సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద బోర్డు ఏర్పాటుచేస్తామన్నారు. గర్భిణుల వార్డు, చిన్నపిల్లల వార్డు ఒకే దగ్గర ఉండేలా చూడాలన్నారు. దానికి అవసరమైన నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ జి.నాగభూషణరావు మాట్లాడుతూ మత్తు వైద్యులు లేరని, అవసరమైతే ప్రయివేట్ వైద్యులను తెచ్చుకోవడానికి నిధులు కేటాయించాలని కోరారు. ఆస్పత్రిలో రోగితో పాటు ఒక పేషెంట్ ఉండేలా ఇక ముందు చర్యలు తీసుకుంటున్నామని, గేట్ పాస్ ఇచ్చి సంబంధిత వ్యక్తులకే అనుమతి ఇస్తామని చెప్పారు. సమావేశంలో ఆర్ఎంఒ రవీంద్రకుమార్, అభివృద్ధి కమిటీ సభ్యులు ఎచ్చెర్ల జయరాం, లక్ష్మి తదితరులున్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఆరోగ్య కార్యక్రమాలపై వైద్య సిబ్బంది పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని పూర్తి స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు చేరువయ్యేలా కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు సూచించారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురం మండలం దుడ్డుఖల్లు, రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన ఆశా డే కార్యక్రమాల్లో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. వైద్య ఆరోగ్య శాఖ నిర్దేశించిన ప్రతీ ఆరోగ్య క్రమం, నవీకరణ చెందుతున్న యాప్‌లు, తదితర అంశాల పై వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. తద్వారా ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించి, అవగాహన కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు గర్భిణులు, శిశువుల్లో అనారోగ్య లక్షణాలను వెంటనే గుర్తించాలని, ఫలితంగా ప్రమాదకర స్థితికి చేరకుండా జాగ్రత పడవచ్చన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఐడిసిఎఫ్ కార్యక్రమంలో భాగంగా ఒఆర్ఎస్, జింక్ కార్నర్లను అవసరమైన అన్ని చోట్లా ఏర్పాటు చేసి డయేరియా నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ సాధారణ ప్రసవాలపై గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ఇ-ఆశా యాప్‌లో ఆరోగ్య వివరాలు నమోదు చేయాలని సూచించారు. గ్రామ ఆరోగ్య, పారిశుధ్య, పోషకాహార కమిటీ సమావేశాలను ప్రతి నెలా నిర్వహించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై ముందస్తు సమాచారాన్ని గ్రామస్తులకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ బివిఎస్ స్వాతి, డాక్టర్ ఎమ్.వినోద్‌కుమార్, సూపర్ వైజర్లు రమణ, శ్రీనివాస్, సుగుణ, గౌడు జయ కుమార్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహనరావు

ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ముగిసిన ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ఈ ఏడాది పాలిటెక్నికల్ కళాశాలలో ప్రవేశానికి నిర్వహించిన పాలీసెట్ 2023లో ర్యాంకులు పొందిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన సోమవారంతో ముగిసిందని ఎమ్మార్ నగరం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ విలియం కేరి ఒక ప్రకటనలో తెలియజేశారు. గత నెల 29 నుంచి కొనసాగిన ఈ కార్యక్రమంలో మొత్తం 421 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించినట్లు చెప్పారు.

9న కలప వేలం

ప్రజాశక్తి-కలెక్టరేట్

సాలూరులోని ప్రభుత్వ వెదురు అమ్మకం డిపోలో ఈ నెల 9వ తేదీన కలప వేలం వేయనున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి జి.ఎ.పి.ప్రసూన తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-కలెక్టరేట్



మున్సిపల్ కార్మికులకు కిట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

కలెక్టర్ కార్యాలయ ఛాంబర్‌లో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు హైజనిక్ కిట్లను మంగళవారం కలెక్టర్ నిశాంత్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో పారిశుధ్య కార్మికులు నిర్వహించిన విధులు వెలకట్టలేనివని కొనియాడారు. ఇటీవల జరిగిన ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచెమ్మ గ్రామ దేవతల ఉత్సవాల్లో ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచారని తెలిపారు. పారిశుధ్య కార్మికులు కనబరిచిన నిబద్ధతకు ప్రత్యేకంగా కలెక్టర్ అభినందించారు. బాధ్యతగా చెత్త సేకరిస్తున్న పారిశుధ్య కార్మికుల పట్ల ప్రజల్లో గౌరవం పెరిగిందన్నారు. గ్రామాల్లో ప్రజా సహకారంతో స్వచ్ఛ జిల్లాగా అవతరించే దిశగా తోడ్పాటు అందించాలని కోరారు. కొత్తవలస కాలనీలో ఈదురు గాలులకు పాక్షికంగా ఇల్లు దెబ్బతిన్న నిరుపేదకు బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పటి, చిన్నారులకు దుస్తులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ మంచుపల్లి శ్రీరాములు, కోశాధికారి పెంటపాటి సూర్యారావు, ఎంసిఎం సభ్యులు బెలగాం జయబాబు, బోటు రామకృష్ణ, పి.ప్రకాశ్, జిల్లా కోఆర్డినేటర్ యమ్మల జనార్దన రావు, స్వచ్ఛంద కార్యకర్తలు మునిసాయి, పూర్ణ చంద్రరావు, బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

పిక్కతీత కార్మికులతో చర్చలు వాయిదా

ప్రజాశక్తి-సాలూరు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని చింతపండు పిక్కతీత కార్మికులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం డిసిఎల్ ఎన్.సుబ్రమణ్యం సమక్షంలో కార్మికులు, చింతపండు గోడౌన్ యజమానుల మధ్య జరిగిన చర్చలు ఫలప్రదం కాలేదు. 13వ తేదికి వాయిదా పడ్డాయి. మంగళవారం పట్టణంలోని ఆర్యవైశ్య ధర్మశాలలో ఇరుపక్షాల వాదనలను డిసిఎల్ సుబ్రహ్మణ్యం విన్నారు. కిలో చింతపండు పిక్కతీతకు కూలి 25 రూపాయలు చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. యాజమాన్య ప్రతినిధులు అంగీకరించలేదు. ఈ నెల 13న విజయనగరంలో చర్చలు ఉంటాయని డిసిఎల్ సుబ్రహ్మణ్యం చెప్పారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, పిక్కతీత కార్మికుల సంఘం నాయకులు నారాయణమ్మ, శ్యామల, గోడౌన్ యజమానుల సంఘం ప్రతినిధులు పి.గోపి, అసిస్టెంట్ లేబర్ అధికారి సుందరరావు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో స్థానిక ఎమ్మార్ నగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం స్కిల్ హబ్‌లో కోర్స్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఆర్ఎం డొమెస్టిక్ వాయిస్ కోర్సులో శిక్షణ పొందిన యువతి, యువకులకు డిఆర్‌డిఎ పీడీ పెద్దింటి కిరణ్ కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి ఎస్ఒ పి.వినోద్ ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయి కుమార్, కళాశాల ప్రిన్సిపల్ విలియమ్ క్యారీ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కేదారిపురం హెల్త్ అసిస్టెంట్‌గా కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తూ మరణించిన పత్రిక శివకుమార్ కుటుంబానికి తోటి ఉద్యోగులు రూ.90 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు మంగళవారం వైద్యులు బుద్దేశ్వర రావు.. శివకుమార్ భార్య దీపకు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ సింహాచలం, సూపర్వైజర్లు ఎం.శ్రీను, ఎన్.రత్నకుమార్, ఎస్‌వి ప్రకాశ్, బి.లక్ష్మణ, ఎర్రయమ్మ, ప్రభావతి, అర్చన, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

గిరిజనుల కోసం అన్ని ప్రాంతాల్లోనూ ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్ల సురేష్ ఒక ప్రకటనలో అధికారులను కోరారు. విద్యార్థులు, గిరిజనులు ఆధార్ కార్డుల్లో చేర్పులు, మార్పులు కోసం విజయనగరం, సాలూరు, గుమ్మలక్ష్మీపురం వైటిసిల్లో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

డిజైనింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో ఎక్కువ మంది చిన్నారులు పాల్గొన్నారు. కలాంకురం ఫ్యాషన్ డిజైనర్, డైరెక్టర్ అల్లు ప్రియాంక ఫాబ్రిక్ పెయింటింగ్‌ను ఉపయోగించి బట్టలపై ఎలా డిజైన్ చేయాలో పిల్లలకు అవగాహన కల్పించారు. ఫ్లవర్, బొమ్మలు డిజైనింగ్ ఎలా చేయాలో నేర్పించారు. గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకులు ఈశ్వర్ పాల్గొన్నారు.

మునగ మొక్కలు పంపిణీకి సిద్ధం

ప్రజాశక్తి-గరుగుబిల్లి

మునగమొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఉపాధి హామీ ఎపిడి రామకృష్ణ తెలిపారు. గరుగుబిల్లి మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి ఎకరాకు 448 మొక్కలు నాటేందుకు ఉచితంగా పంపిణీ చేయాలని ఆదేశించిందన్నారు. మునగ మొక్కలు కావాలంటే తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. హార్టికల్చర్‌లో భాగంగా మామిడి, జీడీ పంటలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. దళయివలస, సంబన్నవలస, నాగూరు, పెద్దూరు గ్రామాల్లో మొక్కలను పెంచుతున్నట్లు చెప్పారు. కిలోమీటర్‌కు 400 కాగు, తురాయి మొక్కల చొప్పున రోడ్డుకు ఇరువైపులా నాటామన్నారు. మారుకొండపుట్టి గ్రామ పరిధిలో 2 ఎకరాల విస్తీర్ణం వరకు టేకు మొక్కలు వేశామన్నారు.

వీరఘట్టం ఎంపిడిఒగా జయంత్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ఎంపిడిఒగా జి జయంత్ ప్రసాద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కవిటి మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ పదోన్నతి పై ఇక్కడికి వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఎంపిడిఒగా ఉన్న వై. వెంకటరమణ పరిపాలన అధికారిగా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా జయంత్ ప్రసాద్ మాట్లాడుతూ అందరు సహకారంతో మండలాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

అవగాహనతో మలేరియా నివారణ

ప్రజాశక్తి -భామిని

అవగాహనతోనే మలేరియా నివారణ సాధ్యమని స్థానిక పి హెచ్‌సి వైద్యులు డాక్టర్ ఫణికుమార్ సూచించారు. జూన్ 1 నుండి 30 వరకు నిర్వహిస్తున్న మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ర్యాలీ నిర్వమించారు. దోమలు వ్యాప్తి ఎలా అరికట్టాలి, దోమ తెరలు వినియోగం, నీరు నిల్వలేకుండా చూడటం, పరిసరాలు శుభ్రంగా ఉంచడం, వైద్య కేంద్రంలో మలేరియా నివారణకు తీసుకుంటున్న జాగ్రత్తలు వంటి అంశాలు వైద్య సిబ్బంది ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం సిహెచ్ఒ భాస్కర్ రావు, హెచ్‌వి గౌరిశ్వరి, ఎఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్‌లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఉల్లిభద్ర సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి-గరుగుబిల్లి

మండలంలో ఉల్లిభద్ర గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి బుధవారం ప్రారంభించనున్నట్లు ఎంపిడిఒ పైడితల్లి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 13 సచివాలయాలు ప్రభుత్వం మంజూరు చేయగా, ఇప్పటికే 11 సచివాలయాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నట్లు చెప్పారు. గొట్టివలస, శివ్వాం సచివాలయాలు కోర్టు వివాదంలో ఉన్నాయని వివరించారు.

గొర్లెకి ప్రముఖుల నివాళి

ప్రజాశక్తి-సాలూరు

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొర్లి మధుసూదనరావు పెద్దకర్మ సందర్భంగా మంగళవారం ప్రముఖులు నివాళులర్పించారు. స్థానిక ఆర్‌సిఎం స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో గొర్లె మధుసూదన రావు చిత్రపటానికి బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, రామభద్రపురం ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి జి.సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్, వైసిపి పట్టణ మాజీ అధ్యక్షుడు జర్జాపు సూరిబాబు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు.

అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసరాలు

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని కృష్ణరాయపురం గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాద బాధితులకు మంగళవారం జనసేన రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు చేతులు మీదుగా నిత్యవసరాలను పంపిణీ చేశారు. ఖర్చులు నిమిత్తం ఆర్థిక సాయం కూడా అందించారు. బాధితులకు తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు పాటి శ్రీనివాస్, జిల్లా నాయకులు శివశంకర్ పోతల, బొన్నాడ గణేష్, వెంకటరమణ, పుతి శ్రీను, బొబ్బిలి మండల అధ్యక్షులు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ఆర్ క్రాంతి పథం అధికారుల తీరు గ్రామైక్య సంఘాల అభివృద్ధి కంటే పతనానికే దారి తీసేలా ఉంది. చేయూత మహిళా మార్ట్ పేరుతో మహిళా సంఘాల సభ్యులను వేధింపులకు గురి చేస్తున్నారని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్వాక్రా మహిళల నుంచి డబ్బులు వసూలు చేసి మహిళా మార్టులు నిర్మించడమే కాకుండా ఇప్పుడు అదే మార్టులో సరుకులు కొనుగోలు చేయకపోతే ఆసరా డబ్బులు ఇవ్వబోమని మెలిక పెడుతున్నారు. రుణం కావాలన్నా కచ్చితంగా మహిళా మార్టులో సరుకులు కొనాల్సిందేనని షరతు విధిస్తున్నారు. దీంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు. అవసరం లేకపోయినా సరుకులు ఎలా కొంటామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్టులో కొంటేనే మాఫీ!

ప్రజాశక్తి -శృంగవరపుకోట

- మహిళా సంఘాల సొమ్ముతో చేయూత మార్టు ఏర్పాటు
- రూ.300 సరుకులు కొనుగోలు చేస్తేనే 'ఆసరా'
- రూ.1000 సామాన్లు కొంటేనే రుణం మంజూరు
- అధికారుల ఆదేశాలతో మహిళల ఆందోళన

మండలంలో 1746 మహిళ సంఘాలు ఉండగా వీటిలో 19,821 మంది సంఘ సభ్యులున్నారు. వీరిలో ఒక్కొక్కరి నుంచి రూ.310 చొప్పున సుమారు రూ.38 లక్షలు గతేడాదే వసూలు చేశారు. ఈ మొత్తంతో తహశీల్దార్ కార్యాలయం దగ్గరలో భారతీయ స్టేట్ బ్యాంక్ పక్కన చేయూత మహిళా మార్టును ఏర్పాటు చేశారు. మార్ట్‌ను విజయవంతంగా నడపాలని అధికారుల ఒత్తిడి చేయడంతో గ్రామైక్య సంఘం అధ్యక్షులు, విఒఎలు మహిళా సంఘసభ్యులను సరుకులు కొనుగోలు చేయాలని హుకుం జారీ చేశారు. అయినప్పటికీ ఎవరూ అక్కడ కొనుగోలు చేసేందుకు ఇష్టపడడం లేదు.

ఇంతలో వైఎస్ఆర్ ఆసరా కింద మూడో విడత మహిళా సంఘాల రుణ మాఫీని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రెండు నెలల క్రితం విడుదల చేశారు. ఆ డబ్బులు నేటికీ మహిళా సంఘాల ఖాతాల్లో జమ కాలేదు. ఇదే విషయాన్ని అవకాశంగా మలుచుకొని గ్రామైక్య సంఘ అధ్యక్షులు, విఒఎలు మహిళా సంఘాల ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ కావాలంటే సంఘంలోని ఎంతమంది సభ్యులు ఉంటే అందరూ రూ.300 చొప్పున మహిళా మార్టులో సరుకులు కొనుగోలు చేయాలని షరతు విధించారు. సరుకులు కొనుగోలు చేసిన మహిళ సంఘంలోని సభ్యులకు మాత్రమే రుణమాఫీ డబ్బులు బ్యాంకు ఖాతాల్లో పడతాయని వేలిముద్రలను తీసుకున్నారు. సరుకులు వద్దంటే ఆసరా డబ్బులు పడవని బెదిరిస్తున్నారని మహిళలు ఆవేదన చెందుతున్నారు.

సంఘ సభ్యురాలిని ఫోన్లో బెదిరించిన విఒఎ

చేయూత మహిళ మార్టు వద్దకు వచ్చిన విలేకరుల ముందే ఒక విఒఎ మహిళా మార్టుకు వచ్చి 1000 రూపాయలు సామాన్లు కొనుగోలు చేయకపోతే నీకు రుణం మంజూరు కాదని బెదిరించారు.

ఎవరినీ బలవంతం చేయటం లేదు

పట్టణంలో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్టులో సరుకులు కొనుగోలు చేయాలని ఎవరినీ బలవంతం చేయడం లేదు. ఎవరిష్ట ప్రకారం వారు కొనుగోలు చేయవచ్చును. ఈ మార్ట్ లోనే కొనుగోలు చేయాలని ఎవరినైనా బలవంతం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. అంతేకాకుండా చేయూత మహిళా మార్ట్ ఏర్పాటు చేసేందుకు మహిళల వద్ద నుండి తీసుకున్న రూ. 310 లకు గాను సంవత్సరం తర్వాత మార్ట్ లాభాలలో వారికి వాటాలు ఇస్తాం. మహిళా మార్ట్‌లో కొనుగోలు చేయాలని బలవంతం చేస్తే వైకెపి కార్యాలయంలో సమాచారం అందించండి.

- సురేష్, ఎపిఎం, శృంగవరపుకోట మండలం.

మార్టులో సామాన్లు కొంటేనే రుణం మంజూరు



మా సంఘ సభ్యులు గతంలో తీసుకున్న రుణం తీరిపోయింది. మళ్లీ రుణం కావాలని కోరగా చేయూత మహిళా మార్టులో ఒక్కో సంఘ సభ్యురాలు వెయ్యి రూపాయలు సామాన్లు కొనుగోలు చేస్తేనే రుణం మంజూరు చేస్తామని అన్నారు. ఒక్కొక్కరం అంత డబ్బు పెట్టి సామాన్లు కొనలేమని ప్రాధేయపడ్డాం. అయినా నెల రోజులు తిరిగినా రుణం మంజూరు కాలేదు. దీంతో చేసేదేమీ లేక ఒక్కొక్కరం వెయ్యి రూపాయలు పెట్టి మహిళా మార్ట్‌లో సామాన్లను కొనుగోలు చేశాం. వెంటనే బ్యాంకు వాళ్లు కూడా రుణం మంజూరు చేశారు.

- పతివాడ పైడితల్లమ్మ, మహిళా సంఘ సభ్యురాలు, పెదఖండేపల్లి

అంటిజోలలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని అంటిజోల గిరిజన గ్రామంలో 104 ఆధ్వర్యంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.ప్రజ్ఞ హాజరై 92 మందికి వైద్య సేవలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం బాలింతలకు, పక్షవాతంతో భాధపడిన వాళ్ళ ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలు అందించి అవసరమైన సూచనలు సలహాలు అందించారు. వడదెబ్బ, మలేరియా బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని నర్సిపురం గ్రామంలో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి జి ప్రదీప్ కుమార్ రోగులను తనిఖీలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు సురక్షితం

ప్రజాశక్తి - సీతానగరం

ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేయాలని డిపిఒ లీల రాణి అన్నారు. మండలంలోని పెదలంకలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణీగా గుర్తించినప్పుడే నెలనెలా వారికి తనిఖీలు నిర్వహించి తగు సూచనలు చేయాలన్నారు. బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యాధికారి కె శిరీష, ఎం. రాధా కాంత్, ఈవో జి సూర్యనారాయణ, హెచ్ఎస్ గోపాలరావు, హెచ్‌వీలు వరలక్ష్మి సత్యవతి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

గిరిజన, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. మంగళవారం పెదమేరంగి పంచాయతీలో పెద్దవలస, జోగిరాజుపేట, రామినాయుడువలస గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గిరిజనులకు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రతి కుటుంబానికి నవరత్నాలు అందజేస్తూ విద్యార్థులను, రైతులను ప్రభుత్వం ఆదుకుంటోందని తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలు ప్రజలకు అందే విధంగా పథకాలు అమలు చేస్తూ నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి నిధులు జమ చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే లబ్ధిదారులను కోరారు. భవిష్యత్తులో జగనన్న ప్రభుత్వానికి మద్దతు పలకాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం.శశికళ, ఎంఎస్ఎంఇ డైరెక్టర్ ఎం.గౌరీశంకర్రావు, డిసిసిబి డైరెక్టర్ లోలుగు నారాయణరావు, వైస్ ఎంపిపి గుడివాడ సంపత్‌కుమార్, సర్పంచ్ రాయపల్లి అనురాధ, వైసిపి నాయకులు పోల వెంకటరత్నం, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

పార్వతీపురం మండలంలో ముగిసిన గడపగడపకు..

పార్వతీపురం రూరల్ : పార్వతీపురం మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారంతో ముగిసిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. మంగళవారం తాళ్లబురిడి పంచాయతీ చప్పవానివలసలో జరిగిన ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. మండలంలో 223 రోజులపాటు నిర్వహించిన గడపగడపకు కార్యక్రమంలో లబ్ధిదారులను వ్యక్తిగతంగా కలుసుకొని వారు ఎదుర్కొంటున్న సమస్యలను వీలైనంతగా పరిష్కరిస్తూ వారి మన్ననలు పొందడం ఆనందంగా ఉందన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

నియోజకవర్గంలోని మిగతా మండలాల్లో కూడా త్వరలోనే ఈ కార్యక్రమం పూర్తవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపించి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, ఎఎంసి చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, నాయకులు భీమవరపు కృష్ణమూర్తి, మడక విశ్వనాథం, బొమ్మి రమేష్, బలగ నాగేశ్వరరావు, యాండ్రాపు తిరుపతి, జక్కు ప్రవీణ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలని నిరసన


నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు

కలెక్టరేట్ : తాగునీటి సౌకర్యం కల్పించాలని కొమరాడ మండలం గుజ్జబడి, ధరసంగి గ్రామ గిరిజనులు మంగళవారం గిరిజన సంఘం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతి అందించారు. కలెక్టర్ స్పందిస్తూ వెంటనే చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు మండంగి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిల్లో వినతులు అందించినా స్పందించకపోవడంతో కలెక్టరేట్‌కు వచ్చినట్లు తెలిపారు. వెంటనే గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజనులు మధు, సురేష్, గణేష్, నరసింహ, సోమరాజు, చెంబు ,నాగు పాల్గొన్నారు.


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పిఒ విష్ణు చరణ్

భవన నిర్మాణ పనులు వేగవంతం

ప్రజాశక్తి - కురుపాం

భవన నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్ అన్నారు. మంగళవారం మండలంలోని మొండెంఖల్ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అదనపు భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత సిబ్బందితో ఆయన మాట్లాడుతూ పనుల్లో ఎక్కడా నాణ్యతా లోపం లేకుండా చూసి, వర్షాకాలానికి ముందుగా నిర్మాణ పనులు పూర్తిచేయాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్-సి ఉద్యోగాలకు దరఖాస్తులు

కలెక్టరేట్ : గ్రూప్-సి ఉద్యోగాలకు యువత దరఖాస్తు చేసుకోవాలని సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్ కోరారు. మంగళవారం వారం ఆయన ప్రకటన విడుదల చేశారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నుంచి కంబైన్డ్ హయ్యర్ సెకండరీ (10+2) లెవెల్ ఎగ్జామినేషన్ 2023 గ్రూప్ 'సి' లోయర్ డివిజనల్ క్లర్క్ / జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ అండ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాల నియామకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. గ్రూప్ 'సి' పోస్టుకు రిక్రూట్‌మెంట్ ద్వారా వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు,భారత ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ రాజ్యాంగ సంస్థలు, ట్రిబ్యునల్ మొదలైన శాఖలలో పనిచేయుటకు లోయర్ డివిజనల్ క్లర్క్, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పోస్టులకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పోటీ పరీక్షను నిర్వహిస్తుందని తెలిపారు. దేశంలోని అన్ని ప్రాంతాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వయోపరిమితి, అవసరమైన విద్యార్హతలు, చెల్లించాల్సిన రుసుము, పరీక్ష విధానం గురించి ssc.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈనెల 10లోగా ఫీజు చెల్లించాలని, ఆగస్టులో పరీక్ష ఉంటుందని తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో ఎల్లమ్మజగ్గడుగూడలో ఉపాధి హామీ ద్వారా నిర్వహిస్తున్న భూ అభివృద్ధి పనులను ఎంపిడిఒ కొండపల్లి సత్యం పరిశీలించారు. దీనిలో భాగంగా ఎవెన్యూ ప్లాంటేషన్ పరిశీలించారు. వేతనదారులకు కూలి గిట్టుబాటు అయ్యేలా కొలతలు ఇవ్వాలని సూచించారు. పనులు జరిగే చోట తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. బిల్లులు సకాలంలో చెల్లించాలని ఉపాధి సిబ్బందికి ఆదేశించారు.

వైభవంగా సిరిమానోత్సవం

రామభద్రపురం : మండలంలోని తారాపురం వెలసిన చింతాలమ్మ, కొత్తమ్మ, బంగారమ్మ, తారాదేవిల సిరిమానోత్సవ పండుగ మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్త జనంతో గ్రామం కిక్కిరిసింది. ఘటాలు, సిరిమాను, వివిధ వేష దారులు సంయుక్తంగా గ్రామం అంతా తిరువీధి తిరిగాయి. ఎండలు అధికంగా ఉండి వడగాలులు వీచినా ప్రజలు తండోప తండులుగా ఉత్సవంలో పాల్గొన్నారు.


రోడ్డుపై వదిలేసిన చెట్టు కొమ్మలు

వీటిని తొలగించండి సారూ..

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

'రహదారిపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించండి సారూ..' అని పట్టణంలో 26వ వార్డు పరిధిలోని టిఆర్ఎంఎం ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఆ రహదారి గుండా రాకపోకలు సాగించే స్థానికులు కోరుతున్నారు. గత ఆదివారం ఈదురు గాలులతో పడిన భారీ వర్షానికి టిఆర్ఎంఎం పాఠశాల ఎదురుగా ఉన్న చెట్టు విద్యుత్తు తీగల పై పడిపోయింది. విద్యుత్తు శాఖ సిబ్బంది చెట్టు కొమ్మలను తొలగించి పాఠశాల ముందు ఉన్న రహదారి పక్కనే పడేశారు. మూడు రోజులు అయినప్పటికీ ఆ వార్డు పరిధిలో ఉన్న సచివాలయ శానిటరీ సెక్రటరీలు కానీ, మున్సిపల్ ప్రజారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది కానీ తొలగించేందుకు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ఇప్పటికైనా రహదారిపై చెట్టుకొమ్మను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

సచివాలయాల సందర్శన

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

మండలంలోని కొండాపురం, అంపిలి సచివాలయాలను ఎంపిడిఒ డొంక త్రినాథులు మంగళవారం సందర్శించారు. సిబ్బంది హాజరుతోపాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించి విధులకు హాజరుకావాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులూ రాకుండా చూడాలని సూచించారు.

గుమ్మలక్ష్మీపురంలో 12 బెంచీలు ఏర్పాటు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

వాటర్ షెడ్ పథకం ద్వారా గుమ్మలక్ష్మీపురం క్లస్టర్‌లో 12 సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్‌రావు తెలిపారు. ఈ బెంచీల ఏర్పాటుతో సాయంత్రం వేళల్లో ప్రజలు సేద తీరేందుకు వీలుంటుందని తెలిపారు.

ఫిర్యాదులు రానివ్వొద్దు

ప్రజాశక్తి - వీరఘట్టం

పాఠ్య పుస్తకాల కంపెనీలు విషయంలో ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం మండల జెవికె స్టాక్ పాయింటు వద్ద పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులందరికీ పుస్తకాలు పంపిణీ చేయడంతో పాటు విద్యాభివృద్ధికి కషి చేయాలన్నారు. స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలకు వాహనాలు ద్వారా పుస్తకాలు సరఫరా చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో మొగదార గ్రామానికి చెందిన చీమల ప్రేమ్ కుమార్ (3) మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. చీమల వినోద్ కుమార్, మీనా మూడో సంతానమైన ప్రేమ్ కుమార్ బయట ఐరన్ స్తంభం వద్ద ఆడుతున్నాడు. అదే సమయంలో విద్యుత్తు మీటర్ నుంచి సరఫరా ఐరన్ పోల్‌కి రావడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇచ్చారు. దీనిపై ఎస్ఐ నీలకంఠరావు కేసు నమోదు చేశారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.